నవశకానికి నాంది పలికిన సీఎం జగన్

- మేయర్ నూర్జహాన్
- పార్టీ జిల్లా కార్యాలయంలో నాలుగేళ్ల పండుగ



పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న నగరమేయర్ షేక్ నూర్జహాన్, చిత్రంలో పార్టీ నాయకులు

ఏలూరు టౌన్: నవశకానికి నాందిపలుకుతూ.. ప్రతి పేదవానికీ భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్నారని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్ అధ్యక్షతన ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వేడుక నిర్వహించారు. మేయర్ నూర్జహాన్ పార్టీ రంగులతో కూడిన కేక్‌ను కట్ చేశారు. పార్టీ నేతలంతా ఒకరికొకరు తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2019లో పార్టీ మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తూ రాజకీయ విలువలు పెంచిన గొప్ప నాయకుడు సీఎం జగన్ అన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఏలూరు నగరంలోనూ అనేక అభివృద్ధి పనులు చేశామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని మేయర్ నూర్జహాన్ వివరించారు.

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

రాష్ట్ర సాహిత్య అకాడమీ చూర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లోనే విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎన్నికల సమయంలోనే కనిపించే పరిస్థితికి భిన్నంగా ఎమ్మెల్యేలు నిత్యం ప్రజలతో మమేకమయ్యేలా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నూతన ఒరవడి తెచ్చారని చెప్పారు. బీసీలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేనివిధంగా రాజకీయ, ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో టీడీపీ చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని, సీఎం జగనన్న బీసీలను బ్యాక్‌బోన్‌గా భావిస్తూ అండగా నిలిచారని చెప్పారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఏలూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయటమే లక్ష్యంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు గూడు కల్పించేందుకు జగనన్న కాలనీలు నిర్మిస్తున్నారని తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో 31 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల హామీలను చూస్తే జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో జనానికి తెలుసన్నారు. గత ఐదేళ్ల కాలంలో పేదలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు తలెత్తుకుని తిరిగేలా సీఎం జగనన్న మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి చూపించారని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, భీమవరపు హేమసుందరి, కిలాడి జ్యోతి, జిజ్జువరపు విజయనిర్మల, ఆర్జి సత్యవతి, పొలిమేర దాసు, జి.ఇమ్మానుయేల్ జయకర్, పప్పు ఉమామహేశ్వరరావు, సుంకర చంద్రశేఖర్, వాణిజ్య విభాగం నాయకులు మోటమర్రి సదానందం, ఏఎంసీ డైరెక్టర్ జక్కుల బెనర్జీ, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, మాజీ కార్పొరేటర్ బందారు కిరణ్‌కుమార్, కిలాడి దుర్గారావు, మజ్జి కాంతారావు, ఇనపనూరి జగదీష్, లక్కోజు గోపి, లూటుకుర్తు సుభాష్ తదితరులు ఉన్నారు.



జీవీమాల్ సెంటర్‌లో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ యువజన, విద్యార్థి, సేవాదళ్ నాయకులు

సంక్షేమ రథసారథి

నాలుగేళ్ల సంక్షేమ పాలనలో సీఎం వైఎస్ జగన్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు పేర్కొన్నారు. ఆర్ఆర్‌పేట జీవీమాల్ సెంటర్‌లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు నిడికొండ నరేంద్ర, విద్యార్థి విభాగం నాయకులు వైఎస్‌వీ శివరావు, సేవాదళ్ నాయకులు యల్లాపు మోజెస్ మాట్లాడారు. సామాజిక విప్లవాన్ని తెస్తూ విద్య, వైద్య రంగంలో వినూత్న మార్పులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. నేడు పేదవానికి ఆరోగ్య భరోసా కల్పిస్తూ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యార్థి భవిష్యత్‌ను మార్చుతూ కార్పొరేట్ రంగానికి దీటుగా ప్రభుత్వ స్కూల్స్‌ను అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తొటకూర కిషోర్, నున్న కిషోర్, రిజ్వాన్, పిట్టా ధనుంజయ్, చైతన్య, ఇదలాడ నాని తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఏఎస్పీ భాస్కరరావును కలిసిన కృష్ణారెడ్డి



ఏఎస్పీ భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎంజేవీ భాస్కరరావును జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావుతో కలిసి ఆయన ఏఎస్పీని కలిసి సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీకి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. రెడ్‌క్రాస్ జీవిత సభ్యత్వాలు, రక్తదాన శిబిరాలను నిర్వహించేందుకు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో విశేష సేవలు అందిస్తోన్న రెడ్‌క్రాస్‌కు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయని అదనపు ఎస్పీ తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన రీతిలో సేవలు అందించాలని సూచించారు.

హక్కులపై అవగాహన అవసరం



రాజ్యాంగ హక్కుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏలూరు వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషా తెలిపారు. మంగళవారం స్థానిక గంగానమ్మ స్కూల్‌లో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు స్థానిక ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. ఎస్సై మదీనా బాషా మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులకు అంతరాయాలు సృష్టిస్తే శిక్షార్హులౌతారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, ఎస్సీఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు మేతర అజయ్, ప్రవల్లిక, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మవారి ప్రసాదం అందజేత

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ప్రసాదాన్ని బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి మంగళవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్‌కు అందజేశారు. అమ్మవారి కుంకుమ, వస్త్రాలను అందజేశారు. ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్ డైరెక్టర్ వేదకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ ప్రధాన కార్యాలయ ఏఓకు వీడ్కోలు



ఏఓ గోపీనాథ్‌కు వీడ్కోలు పలుకుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏఎస్పీ భాస్కరరావు, సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చీపురుపల్లి గోపీనాథ్ బదిలీ అయ్యారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఏఓగా బదిలీపై వెళుతున్నారు. మంగళవారం ఏలూరులో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీస్ ప్రధాన కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఏఓకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏలూరు జిల్లాలో విశేష సేవలు అందించారని, సమష్టిగా విధులు నిర్వర్తిస్తూ సిబ్బందికి తమ సహాయ సహకారాలు అందించారని కోరారు. ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు మాట్లాడుతూ జిల్లా పునర్విభజన కాలంలో సిబ్బందిని ఇతర జిల్లాలకు సర్దుబాటు చేయటంలో ఎంతో కష్టపడ్డారని, ఏలూరు జిల్లా విభజన అనంతరం 17 నెలలపాటు సేవలు అందించారని అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రధాన కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత సినీ హీరో, ఏలూరు మాజీ ఎంపీ సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ ఈ నెల 31న నిర్వహించనున్నట్టు ఏలూరు సిటీ వైడ్ కృష్ణ అభిమాన సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జన్మభూమి పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని కృష్ణ జన్మదినం సందర్భంగా బుధవారం ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆవిష్కరిస్తారని తెలిపారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, కృష్ణ అభిమానులతో పాటు మహేష్ బాబు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని తెలిపారు.

చంద్రబాబుకు అధికార దాహం అధికం

- ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన బాబు
- టీడీపీకి రాజకీయ భవిష్యత్తు లేదు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



వలంటీర్‌ను దుశ్శాలువతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదపాడు : అధికార దాహంతో కుర్చీ ఎక్కాలన్న తాపత్రయంతో చంద్రబాబు పచ్చి అబద్ధాలాడుతూ ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు టీటీడీసీలో వలంటీర్లకు వందనం కార్యక్రమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ జగనన్న రాజ్యంలో వలంటీర్లే సైనికులని చెప్పారు. తన ఆలోచనలను ఆచరణలో పెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వలంటరీ వ్యవస్థ విజయవంతమవడంతో చంద్రబాబు మతి స్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నాడన్నారు. మంచిచేస్తేనే మాకు ఓటు వేయండని అడగగల దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇళ్ల స్థలాలపై విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులు 14ఏళ్లలో ఏ ఒక్కరికైనా స్థలం కొని ఇళ్లు ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకి మెండుగా ఉందని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, జిల్లా రైసు మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ ఏలూరు డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కాటి సుధాకర్ వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు.

వలంటీర్లకు అవార్డులతో ప్రోత్సాహం

వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న అవార్డులు అందించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. అనంతరం వలంటీర్లు సేవలను కొనియాడారు. సేవా వజ్ర అవార్డును పొందిన అప్పనవీడు వట్లూరు వలంటీర్లు ఎన్ దుర్గారావు, ఎన్ వరలక్ష్మిలను సేవా రత్న అవార్డులు పొందిన అప్పనవీడు, కొక్కిరపాడు, వట్లూరు గ్రామాలకు చెందిన వలంటీర్లు ఎం శ్రీవేణి, గాలంకి పద్మ, గుడిపూడి జ్యోతి, మరీదు రజిత, ఎస్ శ్రీలక్ష్మిను సేవా మిత్ర వలంటీర్లను దుశ్శాలువాతో సత్కరించి, పతకాలు అందించారు. ఇంద్రకీలాద్రి ట్రస్టుబోర్డు మెంబరు తొత్తడి వేదకుమారి, మండల ఉపాధ్యక్షులు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, సర్పంచ్‌లు గుజ్జుల రత్నకుమారి, వత్రపు విష్ణుతులసి కోటిరెడ్డి, చిన్నా ఝాన్సీ, మరీదు రెడ్డియ్య, ఏనుగ అబ్రహం, సిద్దాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీలు మాగంటి ఆదిలక్ష్మి, తృవలం కనకదుర్గ, వీరంకి బుజ్జి, కంభాల నాగరాజు, పూడి అప్పలస్వామి, మారుమూడి కృపామణి, నాయకులు కడిమి గోవిందరావు, కొండేలాజరు, కోట గోవర్ధన్, కేశన సతీష్, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకులు గెద్దం సుధీర్, గుణుపూరు మహేష్, పూడి రంగప్పారావు, ఎంపీడీఓ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయ కుమార్‌రాజు, ఎంఈఓ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం



కార్యక్రమంలో నినదిస్తున్న సీఐటీయూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్మికుల హక్కులు, రాయితీల సాధనకు సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ సుందరయ్య పేర్కొన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం అల్లూరు సత్యనారాయణ భవన్ వద్ద డీఎన్‌వీడీ ప్రసాద్ సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్, సుందరయ్యలు మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సీఐటీయూ 53 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా వీరోచిత పోరాటాలు నిర్వహించిందని, వివిధ పోరాటాల ఫలితంగా ఎన్నో చట్టాలు సాధించగలిగామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న చట్టాల సాధనలో సంఘం చేసిన అవిశ్రాంత కృషి ఎంతో ఉందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను చట్టాలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చారని వాపోయారు. లేబర్ కోడ్‌లు కార్పొరేట్ సంస్థలకు, యాజమాన్యాలకు ఊడిగం చేసేందుకేనన్నారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రానున్న కాలంలో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఐవీ సుధాకర్, కె.విజయలక్ష్మి, టీపీఆర్ దొర, జై.గోపి, వీజీఎంఆర్ కృష్ణారావు, టీకే రావు, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్‌తో పింఛను కోసం ఒత్తిడి

దెందులూరు: కొత్తగూడెం పంచాయతీలో సింగవరం సివారులో పంజరపు ప్రసాద్ ఆరోగ్యం బాగానే ఉన్నా ఏ విధమైన అంగవైకల్యం లేకపోయినా నకిలీ వికలాంగ సర్టిఫికెట్‌తో పింఛన్ కోసం సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారని సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత ఆరోపించారు. రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయి విచారణ నిర్వహించి, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మీని సర్పంచ్ లిఖిత పూర్వకంగా కోరారు.

4న స్వర నీరాజనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఘంటసాల సంగీత కళాశాల, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 4న మధుర గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ రేవతి రాంకుమార్, రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. నగరానికి చెందిన వర్ధమాన గాయకులు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన పాటలను పాడి అలరిస్తారన్నారు. కార్యక్రమంలో బాలు అభిమానులు, సంగీత ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విచారణ సక్రమంగా నిర్వహించాలి

దెందులూరు : దెందులూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం చేయకుంటే సమాచార హక్కు చట్టంలో వివరాలు అడిగి సంవత్సరం అయినా ఎందుకు ఇవ్వడం లేదని దెందులూరు ఏఎంసీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత పులిపాటి శ్యామలాదేవి అన్నారు. మంగళవారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు అందడంతో జిల్లా అధికారులు, విచారణ అధికారులను నియమించారని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ సక్రమంగా పూర్తి స్థాయిలో నిర్వహించేలా పర్యవేక్షణాధికారిణి నియమించాలని శ్యామలాదేవి కోరారు.


బాలికా విద్యను ప్రోత్సహించాలి

టి.నరసాపురం : బాలికా విద్యను ప్రోత్సహించడం ద్వారా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి అన్నారు. టి.నరసాపురంలో ఆడపిల్లలను రక్షించు, ఆడపిల్లలను చదివించు నినాదంతో బాలికా విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో లక్ష్మి మాట్లాడుతూ లింగ వివక్షత, అసమానతలు వంటివి రూపుమాపాలంటే బాలికా విద్యను ప్రోత్సహించడం ఒక్కటే మార్గమన్నారు. కుటుంబాన్ని చక్కదిద్దే గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించే మహిళకు విద్య చాలా అవసరం అన్నారు. చిన్ననాటి నుంచే బాలికలను విద్యలో ప్రోత్సహించి, భారతావనికి మెరుగైన మహిళా శక్తిని అందించాలన్నారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని, బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని తెలిపారు.

దౌర్జన్యం కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దౌర్జన్యం చేసిన నేరంపై మంగళవారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. గత డిసెంబర్ 30న కొండూరి సీతాకుమారి ఇంట్లో ఉండగా, కొనకళ్ల రాంబాబు, కొనకళ్ల సుధాకర్, కొనకళ్ల శ్రీనివాస్ మరో నలుగురు వ్యక్తులు సీతాకుమారి ఇంట్లోకి ప్రవేశించి వస్తువులను ధ్వంసచేశారన్నారు. ఇల్లు ఖాళీ చేయకపోతే చంపుతామని బెదిరించారని సీతాకుమారి ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పేదలకు అందుబాటులో మెరుగైన వైద్యం



విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం ముండూరులో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలను ఎమ్మెల్యే, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు స్థానిక నాయకులతో కలిసి రిబ్బన్ కట్‌చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై సీఎం జగన్ దృష్టి సారించి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. పెదవేగి మండలంలోని 28 సచివాలయాల పరిధిలో గ్రామస్థాయి విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించి నైపుణ్యత కలిగిన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నేడు మేజర్ పంచాయతీ ముండూరు ప్రజల వైద్య అవసరాల దృష్ట్యా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, సర్పంచ్ రాచూరి దేవిబాల తదితరులు పాల్గొన్నారు.